

# అరుగుమీది ఆకలికల

అతని అన్న రిక్షా లాగుతాడు. అతని అక్క పాచిపని చేస్తుంది. అతని తల్లి వండి పెడుతుంది. అతను పత్రికలు అమ్ముతూంటాడు. నెలకు ఇరవై రూపాయల జీతం. ఇవీ అతనిని గురించిన వివరాలు అందరకూ తెలిసినవి. అందరూ తెలుసుకో ప్రయత్నించని వివరాలు ఎన్నెన్నో ఉన్నాయాతనిలో.

స్వగ్రామం వదలిపెట్టి, తన దేశం నుండి పారిపోయివచ్చిన కాందిశీకుడు అతను. అతనే దేశాన్ని వదిలాడా? అతని దేశమే అతనిని వదిలిందా? లోతుకు పోయిచూస్తే తెలుస్తుంది దేశమే అతనిని తరిమేసిందని, వెళ్ళగొట్టిందని. కాని స్వగ్రామమన్నా, స్వదేశమన్నా అతను పడిచస్తాడు. స్వదేశాన్ని ఎంతో గౌరవిస్తూ మాట్లాడతాడు ప్రతిసారీ. కాని అతనికెందుకో అవ్యాజానురాగం తన దేశమంటే.

స్వదేశం వదలివచ్చిన దినాలు అతనికి బాగా జ్ఞాపకమున్నయ్. అప్పటికి అతనికి పదో సంవత్సరం. గతిలేక బళ్ళోకెళ్ళి చదువుకుంటుండేవాడు ఆరోజుల్లో, ఇంటిదగ్గరవాళ్ళ పోరు పడలేక. కాని ఆ వచ్చేసేరోజున మాత్రం అతని ప్రాణానికి ఎంతో హాయిగా ఉన్నది.

తన కుటుంబం అక్కడ నుండి ఎందుకు తరలిరావలసి వచ్చిందో అతనికి పూర్తిగా తెలియదు. అసలుకొంతవరకైనా తెలియదుకూడా నేమో. కాని అక్కడి ప్రజలకూ, వాతావరణానికీ భయపడి వచ్చేశారని మాత్రం తనకు తెలుసు. ఎన్నోసార్లు అడిగాడు తన అన్నని. కాని ఎందుకో చెప్పలేదు. తనా విషయాన్ని ఎన్నిసార్లడిగినా మాటలతో దాటవేసేవాడు తన అన్న. ఆ విషయాన్ని కప్పిపుచ్చటంలో తన అన్న అభిప్రాయం ఏమిటో? తన తండ్రి ఉన్నట్లయితే ఎంత బాగుండేది! తనడిగిన ప్రశ్నల కన్నిటికీ సమాధానాలు చెప్పేవాడు. కాని తన తండ్రి లేడు.

అతను తీవ్రంగా ఆలోచించుకు పోతున్నాడు. తన తండ్రి ఎందుకు, ఏవిధంగా, ఏ రోజు చనిపోయాడో కూడా తెలియదు. తను ఆనాటి పరిస్థితుల నన్నిటినీ మననంచేసుకొని చూశాడు. కాని తన తండ్రి ఎందుకు చనిపోయాడో? ఇప్పటికీ అదంతా చీకటిగానే కనిపిస్తుంది అతని కళ్లకు.

ఆరోజు పేపర్లన్నీ అమ్ముడు పోయినా కూడా అతనికెందుకనో సంతోషంగా లేదు. తన తండ్రి విషయం గుర్తుకొచ్చిన ప్రతిసారీ ఇంతే. ఏదో తీరని అనుమానం ఆవరించేస్తుంది ఆవిషయం గుర్తుకురాగానే. ఎన్నాళ్లో ప్రయత్నించాడు ఆ విషయాన్ని పరిష్కరిద్దామని. కాని నెగ్గలేక పోయాడు.

కాగా తన పరిస్థితిని చూసుకొన్నకొద్దీ లోని ఆవేదన మితిమీరుతుంది. ఆనాడు తను పెంకుటింట్లో ఉండేవాడు. మంచంమీద పండుకొనేవాడు. కాని ఈరోజు లైబ్రరీ అరుగులు మాత్రమే అతనిని ఆహ్వానిస్తున్నయ్. ఆ రోజుల్లో తను అలిగి, అన్నం తినకుండా క్రిందపడి దొర్లాడుతుంటే అమ్మా, నాన్నా గడ్డంపట్టుకొని, బతిమిలాడి బుజ్జగించి మరీ, మంచంమీద పండుకోబెట్టేవారు. కాని ఈరోజున—తను రోడ్డుమీద పడుకున్నా అడిగేవాడు లేడు. పరిస్థితులతో పాటు మానవమనస్తత్వం కూడా మారుతుంది.

"అమరశ్రీ"

కాని ఇల్లు వదిలిపెట్టి వచ్చేరోజున తను ఎంతో సంతోషించాడు. బడి బాధ తప్పింది గదా, అని. ఏరోజుకారోజు సంపాదించుకొని తినటం ఎంతహాయి! అనుకున్నాడు. ఆనాడు తనొక తెలివితక్కువ దద్దమ్మనని మాత్రం ఈనాడు తను గుర్తించగలిగాడు.

ఈరోజు పేపర్లన్నీ అమ్ముడుపోయినయ్. ప్రొద్దున్నే లేచి ఎవరిముఖం చూశాడో జ్ఞాపకం లేదు తనకు. లైబ్రరీ అరుగుమీద కూర్చొని ఆలోచిస్తున్నాడు. ఇంతలో రిక్షా గంట మోగింది. చూశాడు తలపైకెత్తి. తన అన్న వచ్చాడు.

తన అన్నను చూస్తూనే ఎందుచేతనో బాధ పడ్డాడు. అది ఎలాంటిబాధో, ఎందుకు పడ్డాడో కూడా చెప్పలేడు తను.

'పేపర్లన్నీ అమ్ముడుపోయినయ్యా?'

'ఆ!'

'అన్నీ' అన్నాడు ఆశ్చర్యంగా అతని అన్న, రిక్షాను నేలకానిస్తూ.

'అన్నీ పోయినయ్. చాలసేపయింది. నేను పెందలకడనే అమ్మేశాను.' అన్నాడు.

* * *

'ఇవ్వాళ రూపాయి అయిదణాలు మిగిలినయ్, అద్దెపోగా.' అన్నాడు అతని అన్న.

'పోనీలే. అంతే చాలు. రేపు నువ్వొక తుండుగుడ్డ కొనుక్కొచ్చుకో' అన్నది ఉడుకుతూన్న అన్నం కలియబెడుతూ అతని తల్లి.

'నాకు వద్దమ్మా! అప్పను కొనుక్కోమను ఏదైనా గుడ్డ' అన్నాడతను.

అతనామాట అంటుండగానే అతని అక్క వచ్చింది అరచేతిలో గిన్నె పట్టుకొని కాళ్లు కడుక్కొని తుడుచుకుంటున్నాడు అతని అన్న

'అన్నంపెట్టమ్మా! ఆకలి మండిపోతోంది' అన్నాడు అతని అన్న.

అతనికి కూడా ఆ ఆకలి ఉన్నది. త్వరగా అన్నం తిందామనుకున్నాడు. కాని ఆలోచిస్తున్నకొద్దీ, ఆకలి కావటం లేదు.

'రారా! నువ్వు తిందువుగాని' అన్నది అతని తల్లి పొయ్యిమీది కుండ దింపుతూ.

'నేను రాను.'

'ఏం' అన్నది అతని అక్క.

'ఆకలిగా లేదు' అన్నాడు.

'పప్పుకూర తెచ్చిందిరా. కాస్తంత తిను' అన్నది అతని తల్లి కళ్ళల్లోకి పొగ పోవటంచేత కళ్లు నులుముకుంటూ.

'లేరా. తిని పడుకుందాం, పెందలకడనే' అన్నాడు తన అన్న, తినటానికి కూర్చుంటూ అతను కూడా మరేమీ మాట్లాడలేక అన్నం ముందు కూర్చున్నాడు. తినటం ప్రారంభించాడు మూకుట్లో ఉన్న అన్నంవంక ఇష్టంలేని చూపులు చూస్తూ. మెల్లగా ముద్దజేసి నోట్లోకి తోస్తున్నాడు. చెత్త మాడిపోతోంది గాబోలు అతని అన్న గబగబా తినేసి చెయ్యి కడుక్కోటానికి పంపుదగ్గరకు పోయాడు.

'తొందరగా కానియ్యరా. చీకటి పడుతోంది. కన్నుపొడుచుకున్నా కన్ను కనుపించదు చీకటిపడితే.' అన్నదతని తల్లి, అన్నంలోకి చారుపోస్తూ.

కాని మునుపటిలాగే మెల్లగా కానిస్తున్నాడు. అనుకున్నంత పని జరిగింది. చీకటి పడింది. మూకుట్లో ఉన్న అన్నం అతని కళ్ళకు సరిగ్గా కనపడటం లేదు. కాని అరుగుముందున్న డాక్టరుగారి కిటికీలోనుంచి వస్తున్న సన్నటి వెలుగు మూకుటిలోని కొంతభాగాన్ని మాత్రం బట్టబయలు చేస్తోంది. ఆ మూకుటిని మరి కాస్త కాంతిలోకి లాగి తినేశాడు అన్నమంతా.

ఆరోజు తన మనస్సంతగా ఎందుచేత పరధ్యాన్నంగా ఉన్నదో అతను తెలుసుకోలేకపోతున్నాడు. తను ఆలోచిస్తున్నా ననుకొన్నాడు. నిజంగా తను ఆలోచిస్తున్నాడా? తనకు ఆలోచించటం చేతయిందా? అసలు ఆలోచించే శక్తి తనలో ఉన్నదా? అతను ఆశ్చర్యపోతున్నాడు. నిజంగా తను అంతసేపట్నుంచీ ఆలోచిస్తున్నాననే నిర్ణయించుకున్నాడు. అంతే. అతను మళ్లా ఆలోచనలో పడ్డాడు.

తన తల్లి డాక్టరుగారింటి కిటికీలోనుంచి పడుతున్న వెలుతురులో అన్నం అన్నం అంటోంది. అతని కెందుకో ఎన్నడూ కలగని ఆలోచనలూ, అభిప్రాయాలూ పుడుతున్నయ్. డాక్టరుగారింట్లోకి చూశాడు కిటికీగుండా. కుర్చీలో కూర్చుని డాక్టరుగారు కాఫీ తాగుతున్నాడు మధ్యమధ్య సిగరెట్ కాలుస్తూ.

వ్యక్తికీ, వ్యక్తికీ మధ్యగల భేదాన్ని వెంటనే గ్రహించగలిగా డతను. తన తల్లికీ, డాక్టరుకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని కొలుస్తున్నాడు. తన కుటుంబానికీ, డాక్టరుగారి కుటుంబానికీ మధ్యగల తేడాను లెక్కవేస్తున్నాడు. కాని వెంటనే గుర్తుకు వచ్చిం దతనికి తను దిన పత్రిక లమ్ముకొనేవాడినని, వాళ్ళు కొనేవాళ్లనీ. దిన పత్రిక లమ్మే తనలో ఇన్ని ఆలోచనలున్నా యని తనెప్పుడూ అనుకోలేదు. ఎవడైనా నమ్ముతాడూ అటువంటప్పు డీవిషయాన్ని!

ఇంతట్లో లైట్లన్నీ ఆరిపోయినయ్. ఎత్తిన ముద్ద తన తల్లి చేతిలో అలాగే ఉండిపోవ టాన్ని చూస్తూనే ఉన్నాడతను. కానేపు తటపటాయించి ఆ ముద్ద నోట్లోకి పోయిన దృశ్యాన్నికూడా చీకటిద్వారా నే చూస్తున్నాడు. తన నోట్లో బీడీమాత్రం ఎర్రగా మెరుస్తోంది, ఆ చీకటి రాజ్యానికంతకూ అధిపతిలా.

ఇంతలో లైట్లు వెలిగినయ్. అతనుమాత్రం కదల్లేదు.

'కిరసనాయిలు పోశారల్లే ఉంది' అన్న దతని తల్లి ఆ లైటు వెలగటాన్ని చూచి.

ఎందుకో నవ్వు వచ్చిం దతనికి,

'కాదమ్మా! అవి ఎలక్ట్రి దీపాలు. కిరస నాయిలు అక్కర్లేదు' అన్నాడు అతను తన కున్న కొద్ది విజ్ఞానాన్ని సద్వినియోగం చేసు కుంటూ. 'మరి ఆ దీపాలకు కిరసనాయిలు లేక పోతే ఎట్లా వెలుగుతయ్యో. మరెందు కారి పోతయ్యి? మనూళ్లో ఇట్లాంటి దీపాలుండేవి గావు' అన్నది గుక్క తిప్పుకోకుండా.

'ఏమో, ఎందు కారిపోయినయ్యో కాని మొత్తానికి అవి కిరసనాయిలు దీపాలు కావని మాత్రం తెల్సు' అన్నా డతను.

అంతేలే నాయనా! అయ్యన్నీ నాకు మాత్రం ఎట్లా తెలుస్తయిలే' అన్నది.

ఆమాట వినగానే అతనిలో ఏదో పొంగు పొంగింది. నూత్నరేఖ వికసించింది. ఏవో కొంగ్రొత్త చిగుళ్ళు మొలకలెత్తినయి.

అవి కిరసనాయిలు దీపాలు కావని తనకెలా తెలిసింది? ఎలాగో తెలుసుకుంటే, ప్రయత్నించి గ్రహిస్తే తెలిసింది. ఆమిగిలిందికూడా తెలుసుకో వచ్చు ప్రయత్నించి. అన్ని విషయాలూ గ్రహించవచ్చు ఓపికా, శ్రద్ధా ఉంటే. ఈ నేర్చు కున్న వాళ్ళంతా తనకంటె గొప్పవాళ్ళా? ఆకాశంనుంచి ఊడిపడ్డారా? ఒకప్పుడు వాళ్ళు కూడా తనలాంటి వాళ్ళే. కాబట్టి తనూ ప్రయ త్నిస్తే వాళ్లంతటి వాడు కావటాని కవకాశా లున్నాయి.

కాని వెంటనే గుర్తుకువచ్చింది తను పేపరు అమ్మే వాడినని.

'ఏం అయ్యా! కూకుండావ్' అన్నాడు అరుగుమీద కూలబడుతూ డాక్టరుగారి పని చేసే ముసలాడు.

'ఏం లేదు, తాతా'

'పోనీ, రాత్రిపూటగూడ ఏ సినిమాలోనో, ఏదన్నా అమ్ముకోపోయ్యావ్' అన్నాడు ఎన్నో అనుభవాలతో ముగ్గిన తాత. ఇంతలో దూరా న్నుంచి ఏవో కేకలు వినవస్తున్నయి. తాత ఏవో మాట్లాడుకుపోతున్నాడు. ఆ కేక లేమీ వినపడటం లేదు కాబోలు. లేకపోతే గందర గోళంగా లేచేవాడే.

'...........'

'జిందాబాద్'

మళ్ళా నిశ్శబ్దం.

'జిందాబాద్'

ఎన్నో గొంతులు గాలిలో నాట్యం చేస్తు న్నయి. మొట్టమొదటి ఒక కంఠంమాత్రం వినిపించటం లేదు.

'...........'

'జిందాబాద్'

రానురాను మధ్యని సమీపిస్తున్నది.

తాతకు కొంచెంగా, విస్పష్టంగా విన పడటమే అందుకు తార్కాణ.

'......అంతా'

'ఏకం కావాలి!'

మళ్ళా ఒకే గొంతుక అరుస్తోంది.

'...ర్కులు'

'తీర్చాలి'

ఇంతలో ఎర్రటి కాగడాల వెలుతురు కను పించింది కనుచూపుమేర దూరంలో.

'కూలీలంతా—'

ఈసారి అంతా స్పష్టంగా వినిపించింది.

'ఏకం కావాలి'

కాగడాలు, ఎర్రటి కాంతి కానవచ్చినయ్. ఆ అరుణ కాంతిలో మెరిసే అరుణ పతాకాలు. ఆ జండాలన్నీ వాళ్ళ శరీర రక్తంతో తడిసి నట్లుగా మెరుస్తున్నయ్.

అతని కళ్లు దిగ్భ్రమ చెందినయ్. తాత ఏదో నోట్లో నోట్లో గొణుక్కుంటున్నాడు. ఆ నినాదాల ధ్వనిలో, బరువులేని తాత మాటలు తేలవలసింది పోయి, మునిగిపోతున్నయ్. కూర్చున్న చోటునుంచి అప్రయత్నంగా లేచాడు ఎందుకో? అతనికే తెలీదు. తాతయ్య అతని చేయి పట్టుకు లాగాడు. పిడికిలి బిగించి ముందడుగు వేశాడు.

వారి వెనకనే నడిచిపోతున్నాడు. 'లైన్' అంటూ అరుచుకుంటూ వచ్చి అతని నెవరో ఒక ప్రక్కకు నెట్టారు. కుడిచేతి ప్రక్క నడుస్తున్న వరుసలో తనుకూడా ఒకడయ్యాడు. వారు చూపిన ఆదరణ అతనికెంతో ప్రోత్సాహాన్ని, ఆనందాన్ని ఇచ్చింది. తనకు తెలియకుండానే నడిచిపోతున్నా డతను.

'కార్మికులంతా'

'ఏకం కావాలి'

అతని గొంతుక అప్రయత్నంగా మిగిలిన గొంతుకలతో ఐక్యమయిపోయింది అతని అనుజ్ఞ తీసుకోకుండానే.

కాసేపు నిశ్శబ్దం. పదధ్వని మాత్రం వినవస్తోంది. ఇంతలో గంభీరంగా కూయ నారంభించింది మునిసిపల్ ఆఫీసులోని 'సైరన్'. కాసేపు కూసి ఆగింది. అతనదే విధంగా ముందడుగు వేస్తూ గమనిస్తున్నాడు.

'వేగరావోయ్ కార్మికా!'

'వేగరావోయ్ కర్షకా'

పాడుతున్నా రెవరో.

అందరూ అతని ననుసరించి చెప్పింది పాడుతున్నారు. అతనుకూడా ఆ 'అందరి'లో ఒకడయిపోయాడు.

పోతున్నారు ఇంకా. ఎన్నో మేడలు ఎన్నో అడ్డరోడ్లు, ఎన్నో ప్రదేశాలూ దాటిపోతున్నారు. అతనూ పోతున్నాడు చేరవలసిన చోటొకటున్న దనుకుంటూ. కాళ్లు నొప్పులు పుడుతున్నాయ్. కాని గమ్యస్థానం చేరాలి, సకాలంలో. ఆదే వాంఛతో సాగిపోతున్నారు ముందుకు.

ఒక్కచోట ఆగిపోయారు. కొన్నికొన్ని నియమిత ప్రదేశాల్లో కూర్చున్నారందరూ. వేదిక మీద జండా క్రింద నిలబడి ఎవరో చెప్పుకు పోతున్నారు. అదంతా తనకోసమే ననుకున్నా డతను. వింటున్నాడు వినపడుతున్న ప్రతి విషయాన్నీ. ఆలోచించి, చీల్చి చూస్తున్నాడు విన్న ప్రతి విషయాన్నీ.

అంతా పూర్తయింది. ఎక్కడివాళ్ళక్కడకు పోతున్నారు. అతనుకూడా లేచాడు. అప్పుడు జ్ఞాపకం వచ్చిందతనికి తను తనేనని. తనుకూడా పోయి వెందల కడనే లైబ్రరీ అరుగుల మీదపడి నిద్రపోవాలని. తను దినపత్రిక లమ్ముకొనేవాడు మాత్రమేనని, మరింకేమీ కాదని ఒకసారికి రెండుసార్లనుకుంటూ వేగంగా సాగిపోయాడు.

నిద్రపట్టక పోయినా పట్టించుకోవాలిగాబట్టి పట్టించుకొన్నాడు. తెల్లవారగనే తను చేయవలసిన పనిని జ్ఞాపకం చేసుకుంటూ నిద్రపోయాడు.

రాత్రి మేలుకున్నందుకుగాను తెల్లవారిన తరువాత గాని లేవలేకపోయాడు. కళ్ళు నులుముకుంటూనే రైల్వేస్టేషనువైపు నడిచాడు. ఆరోజు 'మెయిలు' బండి ఆలశ్యంగా వచ్చింది గాబట్టి సరిపోయింది. లేకపోతే ఆ రోజు సంపాదన సున్న. తన అదృష్టం బాగున్నందుకు లోలోపలనే సంతోషిస్తూ పేపర్లుపట్టుకుని రోజులానే అరుచుకు పోతున్నాడు. వచ్చిన పాటనే వల్లించిన విధంగా.

పేపర్లు అతిత్వరితంగా అమ్ముడుపోతున్నయ్. మరొక్క పేపరు మిగిలింది. ఎందుచేత అంత త్వరగా అమ్ముడు పోయాయో తెలటం లేదతనికి. ఆమిగిలిన పేపరుకాస్తా చేతబట్టుకొని త్వరత్వరగా లైబ్రరీ అరుగుమీదికి చేరుకొన్నాడు. తన స్థావరంలో కూర్చుని, తనకు వచ్చిన కొద్ది చదువునూ, విజ్ఞానాన్నీ ఉపయోగించి పేపరు చదువుతున్నాడు. పేపర్లమ్మటం మొదలుపెట్టి సంవత్సరమయినాకూడా ఎన్నడూ పేపరు చదివిన పాపానపోలేదు. కాని పూలమాలలతో మునిగిపోతున్న ఒక మనిషి ఫోటో? పేపరులో చూస్తూ అంతా చదివాడు. ఆ ప్రముఖుడి జన్మ

దినం కావటంచేతనే ఆ పత్రికలన్నీ ఒక్కుమ్మడిగా అమ్ముడుపోయాయని నిర్ణయించుకున్నాడు.

* * *

రోజూ పేపరు చదవటం అలవాటయిపోయింది, ఊళ్ళో ఎక్కడ మీటింగు జరిగినా వెళ్ళి వినటం అలవాటయింది. అన్ని రాజకీయ విషయాలు అమూలాగ్రంగా తెలుసుకున్నయాతని కీనాడు.

అతని కుటుంబాన్ని ఒక అద్దె భూరికొంపలో ప్రవేశ పెట్టాడు. అతను ప్రెస్సులో 'ప్రూఫు రీడరు'గా కుదిరాడు. ఆ ఊరి 'ప్రెస్ వర్కర్ ఎసోసియేషన్' సెక్రటరీగా ఎన్నుకోబడ్డాడు.

ఇది వరకు అన్ని మీటింగులలో పాల్గొనేవాడు. ఈనాడు అన్నిటిని ఏర్పాటు చేసికొనే సాగిస్తున్నాడు. ఆ ఊళ్ళో ఆతనంటే తెలియని వాళ్ళు లేరు. మరికొన్ని నెలలు గడచిపోయినయ్. ఆ జిల్లాలో అతనంటే తెలియని పిల్లవాడుకూడా లేడు. మరికొన్ని సంవత్సరాలు గడిచినయ్. దేశంలో అతని నామాన్ని స్మరించని వాడు ఉన్నాడనే అనుకోరు ఎవరూ.

అన్ని పేపర్లూ అతని చిత్రాలతో, అతనిని గురించిన వివరాలతో, అతని చరిత్రతో, ప్రశంసలతో, అతని గొప్పతనంతో నిండిపోయినయ్. అతను ప్రభుత్వాన్ని నూతనంగా నిర్మించాడు బీదల ప్రభుత్వాన్ని. పూర్వం తనలాటి స్థితిలో ఉన్న ఇప్పటి వాళ్ళందరకూ అందుబాటులో ఉండేలా.

తన కుటుంబం ఈనాడు మేడలో, ఎలక్ట్రిక్ దీపాల వెలుతురులో తళతళ మంటున్నది. కాని తను మొట్ట మొదట బీదల హక్కుల కోసం కృషి చేస్తున్న సమయంలో తన తల్లి అన్నది: 'జాగ్రత్త నాయనా! అందుచేతనే మీ నాన్న చనిపోయింది. అందుచేతనే మనం ఇక్కడకు రావలసి వచ్చింది'. కాని జాగ్రత్తగానే పాటుబడి అభ్యుదయ నిరోధక శక్తులను నిర్మూలించ గలిగాడు. కాని...

ఏదో స్కూలు భవనానికి శంకుస్థాపన చేయటానికి ఆహ్వానించారతనిని. వెళ్ళాడతను. ఆ దేశోన్నతి మూలకారకుడు అక్కడ పడి ఉన్న పొగచూరిన రాళ్ళవంక చూచాడు.



లేడీ మెగన్ లాయిడ్-జార్జి. గత యిరవై సంవత్సరాలుగా యీమె యింగ్లండ్ పార్లమెంటు మెంబరుగా ఉండి దేశానికి చేసిన సేవ పురస్కరించుకుని బ్రిటిష్ లిబరల్ పార్టీ యిటీవల భారియెత్తున యీమెకు సన్మానం చేసింది.

---

'అది ఎక్కడిది?' అన్నాడు- ఆ స్కూలు నిర్మాణానికి స్థలం ధర్మం చేసిన పెద్దమనిషితో.

'ఇంతకు ముందు ఎవరో అడుక్కునేవారు పొయ్యిలు పెట్టుకొని వండుకునే స్థలం. ఇది కట్టటం ఆరంభించాక వాళ్ళను వెళ్ళగొట్టేశాము' అన్నాడాయన.

గుడ్లప్పగిస్తూ అలాగే చూస్తూ నిలబడిపోయాడతను. పరిస్థితులను మార్చి, సమస్త మానవులకూ ఆనందాన్ని ఇవ్వగలిగానని గర్వించే అతను ఆ విధంగా చూస్తూనే, అక్కడే పడి కన్ను మూశాడు. అందరూ చూస్తూ అలాగే నిలబడ్డారు, కారణం గ్రహించారో, లేదో?